# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

సంపుటి : 3 | సంచిక : 326 | మంగళవారం 14 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vnteluguaily@gmail.com


## కేసీఆర్‌కు మంత్రి సీతక్క
# లీగల్ నోటీసులు



- 48 గంటల్లోకి ఆ పోస్టులు తొలగించాలని డిమాండ్
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు
- అంగన్‌వాడీ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపాటు
- 48 గంటల్లో పోస్టులు తొలగించి క్షమాపణలు చెప్పాలని నోటీసులు

హైదరాబాద్

అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోలుపై ఆరోపణలు విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపారు. నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆమె నోటీసుల్లో పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని సీతక్క తెలిపారు. టెండర్ వాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇచ్చినట్లు - మిగతా3లో



## పార్లమెంటు కొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉంది

- నారీ శక్తి వందన్ సమ్మేళన్‌లో ప్రధాని కీలక వ్యాఖ్యలు
- మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దపు పెద్ద నిర్ణయం
- 2029లోగా అమలు చేయాలని లక్ష్యం
- అన్ని పార్టీల సహకారం అవసరమని మోదీ పిలుపు

## మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

- రాజకీయ లబ్ధి కోసమే మోదీ సర్కార్ అలా చేస్తోంది
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురానున్న కేంద్రం
- మహిళా రిజర్వేషన్ చట్టానికి తాము వ్యతిరేకం కాదన్న ఖర్గే
- నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించిన సోనియా గాంధీ



## దక్షిణాది రాష్ట్రాలపై
# కేంద్రం వివక్ష

### డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను



- మహిళా రిజర్వేషన్ల పేరుతో లోక్‌సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందన్న రేవంత్ రెడ్డి
- మహిళాబిల్లుకు ప్రతి ఒక్కరూ మద్దతిస్తారని స్పష్టం
- జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల పెంచేలా బీజేపీ యత్నిస్తోందని ట్వీట్
- ఎన్డీఏ ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కటం లేదు
- డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని పార్టీలకు లేఖలు రాస్తాం
- డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను
- మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడి పెట్టొద్దు
- సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి

హైదరాబాద్

పురుషులతో పాటు మహిళలకు సమాన ఓటు హక్కు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని.. అలాంటి పార్టీ మహిళా రిజర్వేషన్ల బిల్లును ఎందుకు వ్యతిరేకిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఇంతకాలం అడ్డుకుంది ఎన్డీయేనే నని ఆరోపించారాయన. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ చేస్తున్న ప్రచారంపై సోమవారం సెక్రటేరియట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అనేవి దేశ ప్రజలందరికీ సంబంధించిన అంశాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ, బీజేపీ మాత్రం తమ సొంత వ్యవహారం అన్నట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను కలిపి తీసుకురావడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏ మాత్రం ప్రాధాన్యం దక్కడం - మిగతా3లో

## కాళేశ్వరం బ్యారేజీల
# పునరుద్ధరణ

- పరీక్షల వేగం కోసం స్టీరింగ్ కమిటీ ఏర్పాటు
- కల్నల్ పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష
- అధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి సమీక్ష
- పునరావాస డిజైన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు



హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల పునరుద్ధరణ పనుల వేగవంతంపై సర్కార్ దృష్టి సారించింది. వేల కోట్ల విలువైన సాగునీటి పథకాన్ని సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తెచ్చేలా కసరత్తు చేస్తోంది. అందుకు అనుగుణంగా బ్యారేజీల పునరుద్ధరణకు పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. మేడిగడ్డను కనీసం పాక్షికంగానైనా వినియోగంలోకి తేవాలని మంత్రి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నీటిపారుదల రంగ నిపుణుడు కర్నల్ పరీక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా అత్యున్నత స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ కమిటీ వారానికి రెండు సార్లు సమావేశాలు నిర్వహిస్తుందని వెల్లడించారు. - మిగతా3లో

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్

- కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- దొంగఓట్లు అరికట్టేందుకు బయోమెట్రిక్స్ నమోదు చేయాలని సుప్రీంకోర్టులో పిల్
- ఎన్నికల నిర్వహణపై కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు






## టీజీఎస్ ఆర్టీసీలో మోగిన
# సమ్మె సైరన్

- ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె
- ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటన
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్



## విజయ్ చాలా పెద్ద స్టార్
## ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం

- జనసేనాని విత్ జెన్‌జీ కార్యక్రమంలో విజయ్‌పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు
- రాజకీయాల్లో రాణించడానికి విజయ్‌కు సలహా ఇస్తారా అని ప్రశ్న




## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

- రేపటికల్లా ఎల్‌పీజీతో భారత్‌కు 'జగ్ విక్రమ్'
- 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని వెల్లడి
- ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు
- వాటిని వీలైనంత త్వరగా హర్మూజ్ దాటిస్తాం: కేంద్రం



## మహిళా సీఎంగా అలాంటి సలహా ఇచ్చినందుకు సిగ్గుపడాలి

- మమతపై అమిత్ షా ఫైర్
- రాత్రి 7 తర్వాత ఇళ్ల బయటకు రావద్దన్నారు
- మహిళా సీఎంగా మహిళలకు ఇచ్చిన సలహాకు మమత సిగ్గుపడాలి
- బీజేపీ వస్తే, యువతులు అర్ధరాత్రి స్కూటర్‌పై తిరగొచ్చు
- బెంగాల్ ఎన్నికల ర్యాలీల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# పార్లమెంటు కొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉంది



దేశం కొత్త చరిత్రను లిఖించడానికి అతి చేరువలో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో అతి కీలకమైన నిర్ణయాల్లో ఒకటిగా నిలిచే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసేందుకు భారత్ సిద్ధమవుతోందని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన నారీ శక్తి వందన్ సమ్మేళన్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఈ నిర్ణయం పూర్తిగా మహిళల సాధికారతకు అంకితమైందని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో కీలక దశలో ఉన్న ఈ సమయంలో మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరమని మోదీ అన్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న మహిళా రిజర్వేషన్ అంశంపై ఇప్పుడు స్పష్టమైన ముందడుగు పడబోతోందని పేర్కొన్నారు. “ఇది కేవలం ఒక బిల్లు కాదు. మహిళల శక్తికి అంకితమైన నిర్ణయం. దేశ భవిష్యత్తు సంకల్పాలను నెరవేర్చే దిశగా ఇది కీలకమైన అడుగు” అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ అవసరం దాదాపు నాలుగు దశాబ్దాలుగా చర్చలో ఉందని, అన్ని రాజకీయ పార్టీలూ తమ తమ స్థాయిలో ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చాయని మోదీ గుర్తు చేశారు. 2023లో పార్లమెంట్‌లో నారీ శక్తి వందన్ అధినియమాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఆ సమయంలోనే 2029లోగా అమలు చేయాలని అన్ని పార్టీలు కోరిన విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు.

**రాజకీయాలను పక్కనపెట్టి సహకరించాలని మోదీ పిలుపు**

ఈ నేపథ్యంలో 2029ను లక్ష్యంగా పెట్టుకుని మహిళా రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రధాని తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో ఈ అంశంపై సమగ్ర చర్చలు జరగనున్నాయని చెప్పారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలను పక్కనపెట్టి సహకరించాలని పిలుపునిచ్చారు. “సమష్టి కృషితో పార్లమెంట్ గౌరవం మరింత పెరుగుతుంది. దేశంలోని ప్రతి మహిళ గర్వపడేలా ఈ నిర్ణయం ఉండాలి” అని అన్నారు. మహిళల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం కేవలం నినాదంగా కాకుండా, పాలనలో సహజ భాగంగా మారాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఈ బిల్లు ఆ దిశగా ఒక పెద్ద అడుగు అవుతుందని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళల పాత్రను ఉదాహరణగా చూపిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షలాది మహిళలు స్థానిక సంస్థల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. సుమారు 14 లక్షలకుపైగా మహిళలు స్థానిక సంస్థల్లో సేవలందిస్తున్నారని, కొన్ని రాష్ట్రాల్లో వారి ప్రాతినిధ్యం 50 శాతానికి చేరుకుందని వివరించారు. ఇది మహిళల నాయకత్వానికి నిదర్శనమని అన్నారు.

**మహిళలకు తోడుగా ఉండే విధంగా!**

దేశంలో రాష్ట్రపతి నుంచి ఆర్థిక మంత్రివరకు కీలక పదవుల్లో మహిళలు సేవలందించడం గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. మహిళలు తమ ప్రత్యేకమైన రాజకీయ వారసత్వాన్ని నిర్మించుకుంటున్నారని, ఇది దేశ అభివృద్ధికి కీలకమని చెప్పారు. మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అనేక పథకాలు అమలు చేస్తోందని ప్రధాని వివరించారు. పుట్టినప్పటి నుంచి జీవితాంతం వరకు మహిళలకు తోడుగా ఉండే విధంగా ప్రభుత్వ విధానాలు రూపొందించామని చెప్పారు. ఇక మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన కీలక అంశాల్లో జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) కూడా భాగమని సమాచారం. ప్రస్తుతం జనగణన ఆలస్యమవుతున్న నేపథ్యంలో 2011 జనగణన ఆధారంగా ఈ ప్రక్రియను కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది. డెలిమిటేషన్ అనంతరం లోక్‌సభ స్థానాలు పెరగవచ్చని అంచనా. ఏప్రిల్ 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన సవరణ బిల్లు, అలాగే డెలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ రెండు బిల్లులు రాజ్యాంగ సవరణలుగా ఆమోదం పొందాల్సి ఉంటుంది. మొత్తానికి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ నిర్ణయం దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశముంది.

# మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు



మహిళా రిజర్వేషన్ల చట్టం గురించి చర్చించేందుకు ఏప్రిల్ 15న తమ పార్టీ ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ బిల్లుపై సంబంధిత వర్గాలన్నింటితోనూ సమగ్ర సంప్రదింపులు జరపడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థాయిలో దీని ప్రభావం విస్తృతంగా ఉన్నందున, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని వెల్లడించారు. కర్ణాటకలోని బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. “మహిళా రిజర్వేషన్ల చట్టంపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ పాల్గొంటుంది. తగు సూచనలను అందిస్తుంది. కానీ కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా లేదు. అందుకే మేము ఏప్రిల్ 15న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూనే ఉంది. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అంతేకాకుండా నారీ శక్తి వందన్ అధినియంకు మేం వ్యతిరేకం కాదు. పార్లమెంట్‌లో ఇది ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టం. మోదీ సర్కార్ కేవలం ఈ చట్టం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోంది. మేము ఇప్పటికే పంచాయతీలు, జిల్లా పరిషత్తులు, కార్పొరేషన్లలో ఈ చట్టాన్ని దీనిని అమలు చేశాము. కాబట్టి మాకు ఎవరూ నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. దేశానికి సంబంధించిన ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, దానికి విస్తృతమైన పర్యవసానాలు ఉంటాయి.”

**మోదీ సర్కార్‌పై సోనియా ఫైర్**

అలాగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు, మహిళా రిజర్వేషన్ల చట్టం తదితర అంశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ సైతం మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టం కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. అలాగే ఈ ప్రక్రియను రాజ్యాంగంపైన చేస్తున్న దాడిగా పేర్కొన్నారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కులగణనను మరింత ఆలస్యం చేసి, దాన్ని పట్టాలు తప్పించడమే ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ అసలు ఉద్దేశమని ఆరోపించారు.

“తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని చూస్తోంది. బలవంతంగా ఆమోదింపజేయాలనుకుంటున్న బిల్లులకు మద్దతు ఇవ్వాలని ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తొందరపాటుకు ఒక కారణం ఉంది. రాజకీయ లబ్ధి పొందడం కోసం, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం కోసమే మోదీ ఇలా చేస్తున్నారు. ప్రధాని మోదీ ఎప్పటిలాగే నిజాన్ని దాచిపెడుతున్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణలపై చర్చించడానికి బంగాల్ చివరి దశ ఎన్నికలు (ఏప్రిల్ 29) ముగిసిన తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ విపక్ష నేతలు ప్రభుత్వానికి ఏకంగా మూడుసార్లు లేఖలు రాశారు. కానీ మోదీ సర్కార్ విపక్షాల అభ్యర్థనను తిరస్కరించింది. అందుకు బదులుగా ప్రధానమంత్రి సంపాదకీయాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, ఇతర సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. నిర్ణయాలు తీసుకునే విషయంలో తన మాటే నెగ్గాలి అన్నట్లు మోదీ వ్యవహరిస్తున్నారు. నారీ శక్తి వందన అధినియం సవరణ బిల్లును పార్లమెంట్ స్పెషల్ సెషన్‌లో కాకుండా పార్లమెంట్ వర్షాకాల సమావేశంలోనే తీసుకురావాలని కోరుతున్నాను.” అని సోనియా గాంధీ పేర్కొన్నారు.

**ఆ హక్కులను పది కోట్ల మంది కోల్పోయారు : సోనియా గాంధీ**

నారీ శక్తి వందన్ అధినియం- 2023 చట్టం 73, 74వ రాజ్యాంగ సవరణ బిల్లుల విజయాల పునాదిపైనే రూపుదిద్దుకుందని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఆ సవరణ బిల్లులు ఆమోదం పొందిన తర్వాతే పంచాయతీలు, నగరపాలక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కల ప్రక్రియ వాస్తవానికి 2021లోనే జరగాల్సి ఉందని, కానీ మోదీ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వచ్చిందని మండిపడ్డారు. దీని పర్యవసానంగా ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనకు ప్రాతిపదికగా నిలిచే జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద లభించే చట్టపరమైన హక్కులను 10 కోట్లకు పైగా ప్రజలు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు.

**కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ**

మరోవైపు, నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి తమ పార్టీ లోక్‌సభ ఎంపీలందరూ తప్పక హాజరుకావాలని కాంగ్రెస్ సోమవారం విప్ జారీ చేసింది. ఏప్రిల్ 16-18 వరకు సభలో అత్యంత కీలకమైన కొన్ని అంశాలపై చర్చ, ఓటింగ్ జరగనున్నాయని తమ పార్టీ ఎంపీలకు సూచించింది. ఆ మూడు రోజులు ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడేంత వరకు తప్పనిసరిగా సభలో ఉండాలని కోరింది. పార్టీ వైఖరికి మద్దతు తెలపాలని కోరుతూ విప్‌ను జారీ చేసింది.

# మహిళా సీఎంగా అలాంటి సలహా ఇచ్చినందుకు సిగ్గుపడాలి



మహిళా ముఖ్యమంత్రి అయినప్పటికీ మమతా బెనర్జీ బంగాల్ సోదరీమణులకు భద్రతను కల్పించలేక పోయారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్‌జీ కర్ రేప్ కేసుపై మమత స్పందిస్తూ, రాత్రి 7 తర్వాత ఇళ్ల బయటకు రావద్దని మహిళలకు సలహా ఇచ్చారని ఆయన విమర్శించారు. ఒక మహిళా సీఎంగా మహిళామణులకు ఆ విధమైన సలహా ఇచ్చినందుకు మమత సిగ్గుపడాలని షా ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో మహిళలకు భద్రతను కల్పించడంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం విఫలమైందన్నారు. సోమవారం బీర్భూమ్ జిల్లా మయూరేశ్వర్, ఖేరాసోల్, పశ్చిమ్ బర్ధమాన్ జిల్లా రాణీ గంజ్‌లలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే, యువతులు అర్ధరాత్రి 1 గంటలకూ స్కూటర్‌పై ప్రయాణించే సురక్షిత పరిస్థితి బంగాల్‌లో వస్తుందన్నారు. సందేశ్ ఖాలి, ఆర్‌జీ కర్, దుర్గాపూర్ లా కాలేజ్ (దక్షిణ కోల్‌కతా లా కాలేజ్) తరహా పైశాచిక ఘటనలు ఇక జరగవని కేంద్ర హోంమంత్రి చెప్పారు.

**అల్లర్లు జరిగినప్పుడు మమత ఎక్కడికి పోయారు?**

“ఇప్పుడే నేను మమతా బెనర్జీ ప్రసంగం ఒకటి విన్నాను. అందులో ఆమె మెజారిటీ సామాజిక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడుతున్నారు. ఈ ఎన్నికల్లో టీఎంసీ గెలవకుంటే, మెజారిటీ సామాజిక వర్గం మనుగడ సాధ్యం కాదని మమత అంటున్నారు. టీఎంసీ పాలనలోనే ముర్షిదాబాద్ అల్లర్లు జరిగాయన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. రామ నవమి వేడుకలపైనా దాడులు జరిగాయి. సరస్వతీ పూజపై నిషేధం విధించారు. అవన్నీ జరిగినప్పుడు మమత ఎక్కడికి పోయారు? రాష్ట్రంలోని మెజారిటీ సామాజిక వర్గాన్ని సీఎం మమత భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీదీ మేం ఎన్నో శతాబ్దాలుగా ఇదే దేశంలో నివసిస్తున్నాం. మమ్మల్ని బెదిరించడానికి మీరెవ్వరు? అయోధ్యలో రామ్ లల్లాను 550 ఏళ్ల పాటు టెంటు కింద ఉంచడానికి మమతా బెనర్జీ లాంటి నేతలే కారకులు. చివరకు ప్రధాని మోదీ సారథ్యంలోనే అయోధ్య రామమందిరం నిర్మాణం జరిగింది. మమతా బెనర్జీ తొత్తు హుమాయూన్ కబీర్ బంగాల్‌లో బాబ్రీ మసీదును నిర్మించాలని కోరుతున్నారు. కానీ అందుకు బీజేపీ అస్సలు అనుమతించదు” అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. “ఈ ఎన్నికలు బంగాల్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారుతాయి. టీఎంసీ గూండాలు ఇకపై బాంబు పేలుళ్లతో బంగాల్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేరు. బంగాల్ ప్రజలు ఆ బాంబులకు బ్యాలట్లతో, భయానికి విశ్వాసంతో సమాధానం ఇస్తారు. బంగాల్ ప్రజలంతా కమలం (తామర పువ్వు) గుర్తుకే ఓటేయాలి. బంగాల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు అనేది గోడపై రాత లాంటిది. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి టాటా బైబై చెప్పాలని బంగాల్ ప్రజలు డిసైడయ్యారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే అందరు టీఎంసీ గూండాల భరతం పడుతుంది. నేను ఇవాళ టీఎంసీ గూండాలకు ఒకే విషయం చెబుతున్నాను. మొదటిదశ పోలింగ్ జరగనున్న ఏప్రిల్ 23న మీరంతా ఇళ్లలోనే ఉండండి. లేదంటే మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చాక మిమ్మల్ని అరెస్టు చేయించి జైల్లో పెట్టిస్తాం. బీజేపీ గెలవగానే టీఎంసీ ప్రభుత్వంలోని సిండికేట్లు, అవినీతిపరులను తలకిందులుగా వేలాడదీసి సరి చేసే బాధ్యతను తీసుకుంటుంది. నేరచరితులకు నెలవుగా టీఎంసీ మారింది. ఆ నేరచరితులే చాలా ఏళ్లుగా బంగాల్‌లోని బీజేపీ క్యాడర్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు జరిగిన మరుసటి రోజు (మే 5న) బీజేపీ కార్యకర్తలు తమను హింసించిన టీఎంసీ గూండాలను బయటకు లాగి న్యాయస్థానాల ఎదుట నిలబెడతారు” అని అమిత్ షా హెచ్చరించారు. “టీఎంసీ ప్రభుత్వం చాలా స్కాంలు చేసింది. దాదాపు రూ. 5వేల కోట్ల మేర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసింది. భారత పార్లమెంటులో జరిగిన ప్రశ్నకు డబ్బులు స్కాంకూ టీఎంసీయే కారణం. 26వేల స్కూల్ టీచర్ల ఉద్యోగాల తొలగింపు యత్నం, రేషన్ పంపిణీ స్కాం, పశువుల స్మగ్లింగ్, స్థానిక సంస్థల్లో ఉద్యోగాల భర్తీ, ఉపాధి హామీ పథకం, పీఎం ఆవాస్ వంటి వాటిలోనూ టీఎంసీ ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మేం అధికారంలోకి వచ్చాక అవినీతిపరుల నుంచి ప్రతీ రూపాయిని కక్కిస్తాం. 7వ వేతన సంఘం సిఫారసులను రాష్ట్రంలో 45 రోజుల్లోగా అమల్లోకి తెస్తాం. మహిళలు, నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ. 3వేలు, గర్భిణులకు రూ. 21వేలు, దివ్యాంగులకు ప్రతినెలా రూ. 2వేలు ఇస్తాం. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. రాష్ట్ర బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతిని కల్పిస్తాం. ఆయుష్మాన్ భారత్ స్కీం ద్వారా రూ. 5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా అందరికీ అందుబాటులోకి వస్తుంది. రైతులకు ఏటా ఇచ్చే ఆర్థికసాయాన్ని రూ. 9వేలకు పెంచుతాం. మేం అధికారంలోకి వచ్చాక బంగాల్‌లో 5 పారిశ్రామిక ఎస్టేట్‌లను నిర్మిస్తాం. తద్వారా రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహానికి మార్గాన్ని సుగమం చేస్తాం” అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. “బంగాల్ సహా దేశం నుంచి చొరబాటుదారులను తరిమేయడానికే ఈ అసెంబ్లీ ఎన్నికలు. బంగాల్ నుంచి చొరబాటుదారులను తరిమేసే సత్తా మమతకు లేదా ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ఉందా? టీఎంసీ ప్రభుత్వం కనీసం దేశ సరిహద్దు కంచెకు కూడా భూమిని కేటాయించడం లేదు. కానీ బంగాల్‌లో చొరబాట్లకు బీఎస్ఎఫ్ కారణమని మమత ఆరోపిస్తున్నారు.

## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

జగ్ విక్రమ్ అనే భారత నౌక 20,400 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ఏప్రిల్ 14కల్లా గుజరాత్‌లోని కాండ్లాకు చేరుకుంటుందని పోర్టులు, నౌకాయానం, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ వెల్లడించారు. 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని ఆయన తెలిపారు. అమెరికా – ఇరాన్ మధ్య 14 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత హర్మూజ్ మీదుగా వస్తున్న తొలి భారత నౌక ఇదేనన్నారు. గత 24 గంటల వ్యవధిలో గల్ఫ్ సముద్ర జలాల్లో భారత జెండా కలిగిన నౌకలు, భారతీయ నావికులపై ఒక్క దాడి కూడా జరగలేదని ముకేశ్ మంగళ్ చెప్పారు. సోమవారం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా – ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 2,177 మంది భారతీయ నావికుల సురక్షిత ప్రయాణానికి తమ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. గల్ఫ్‌లో గత 24 గంటల్లోనే 93 మంది భారతీయ నావికుల కోసం సురక్షిత ప్రయాణ ఏర్పాట్లు చేశామని ముకేశ్ పేర్కొన్నారు.

**ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు**

“నావికుల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నాం. ఇందుకోసం నిరంతరాయంగా సముద్రజలాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. భారత విదేశాంగ శాఖ, గల్ఫ్ పరిధిలోని భారతీయ మిషన్లు, సముద్ర జల రవాణాతో ముడిపడిన విభాగాలు, సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నాం. గల్ఫ్‌లో చిక్కుకున్న అన్ని భారతీయ నౌకలను తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనంత త్వరగా వాటిని హర్మూజ్ దాటించి భారత్‌కు తీసుకొస్తాం. ప్రస్తుతానికి భారత్‌కు చెందిన 15 నౌకలు గల్ఫ్ సముద్ర జలాల్లో ఉన్నాయి” అని కేంద్ర నౌకాయాన శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ తెలిపారు.

**నిరంతరాయంగా ఎల్‌పీజీ సప్లై**

**బాధ్యతాయుతంగా వినియోగించాలని పిలుపు**

భారత్‌లో తగినంత ఎల్‌పీజీ స్టాక్ ఉందని, సిలిండర్ల పంపిణీ నిలకడగా జరుగుతోందని కేంద్ర పెట్రోలియం – సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. దేశ ప్రజలంతా బాధ్యతాయుతంగా ఎల్‌పీజీని వినియోగించాలని, భయాందోళనతో గ్యాస్ బుకింగ్స్ చేయొద్దని సూచించారు. ఇకపైనా ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ నిరాటంకంగా జరుగుతుందని ఆమె భరోసా ఇచ్చారు. ఎల్‌పీజీ నిల్వలపై భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తోందని, దేశవ్యాప్తంగా ప్రజలకు సిలిండర్ల సప్లైలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తోందని సుజాత శర్మ చెప్పారు. దేశంలోని ఎల్‌పీజీ కస్టమర్లలో దాదాపు 99 శాతం మంది ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్, వాట్సాప్, మొబైల్ అప్లికేషన్ల వంటి డిజిటల్ వేదికల ద్వారా సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలకు జనం రద్దీ తగ్గుతుందని, వేగవంతంగా సిలిండర్ల డెలివరీకి అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

**ఎలక్ట్రిక్ వాహనాలపై రాయితీల పొడిగింపు**

ఎలక్ట్రిక్ వాహనాలపై అందిస్తున్న రాయితీలను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఎలక్ట్రిక్ త్రీ వీలర్లపై అందించే సబ్సిడీకి సంబంధించిన టర్మినల్ తేదీని 2028 మార్చి వరకు పొడిగించామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. ఇక టూవీలర్లపై రాయితీ పొడిగింపు 2026 జులై వరకు అమల్లో ఉంటుందన్నారు.

**ప్రధాని ఆదేశాల మేరకు గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్ బలోపేతం**

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు తాము గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్‌ను బలోపేతం చేస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఇందులో భాగంగానే భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఏప్రిల్ 11, 12 తేదీల్లో యూఏఈలో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పెద్దలను కలిశారని ఆయన తెలిపారు. పశ్చిమాసియా సైనిక ఘర్షణ వేళ భారతీయులకు భద్రత కల్పించినందుకు యూఏఈ పాలకులకు భారత విదేశాంగ మంత్రి ధన్యవాదాలు చెప్పారన్నారు.

## విజయ్ చాలా పెద్ద స్టార్ ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం

లతమిళనాడు ఎన్నికల్లో బరిలోకి దిగిన నటుడు విజయ్?కు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మద్దతు తెలిపారు. విజయ్ సమర్థుడని, చాలా పెద్ద స్టార్? అని కొనియాడారు. అలాంటి వ్యక్తి ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని అన్నారు. ఇటీవల ‘జనసేనాని విత్ జెన్‌జీ’ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌కు సలహా ఇస్తారా అని అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. ‘నేను ఎవరికీ సలహా ఇవ్వను. నా పిల్లలకు విషయంలో కూడా అంతే. ప్రతి ఒక్కరూ తమదైన మార్గంలో ముందుకు వెళ్లగలరు. ఇక విజయ్? విషయానికొస్తే ఆయన చాలా పెద్ద స్టార్. ప్రతి పౌరుడికి రాజకీయాల్లోకి రావడానికి, పార్టీ స్థాపించడానికి హక్కు ఉంది. ఆయన ఏ పాత్రలో ఉన్నా ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని నేను భావిస్తున్నా’ అని పవన్ కల్యాణ్ తెలిపారు. పాలిటిక్స్‌లోకి రావాలంటే ఎలాంటి త్యాగాలు చేయాల్సి వస్తుంది? అని ఓ యువకుడు అడిగిన ప్రశ్నించాడు. అందుకు త్యాగాలు చేయకూడదు అని పవన్ కల్యాణ్ బదులిచ్చారు. రాజకీయాన్ని ఎప్పుడూ వ్యాపారం కోణంలో చూడకూడదని చెప్పారు. ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉంటే ఎవరైనా రాజకీయాల్లోకి రావొచ్చని సలహా ఇచ్చారు. సరైన విధంగా వినియోగించుకుంటే సోషల్ మీడియా ఎంతో పవర్‌ఫుల్ అని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఒకవేళ మీరు కంటెంట్ క్రియేటర్ అయి ఉంటే ఎలాంటి వీడియోలు చేస్తారు అని అడగ్గా, దేశభక్తి, ప్రకృతి పరిరక్షణపై చేస్తానని చెప్పారు. జనసేన పార్టీను 2014లో స్థాపించిన పవన్ కల్యాణ్, తొలినాళ్లలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నారు. 2019 ఎన్నికల్లో పరాజయాలు చవిచూసినా, 2024లో తెలుగుదేశం పార్టీ, బీజేపీతో కలిసి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రాజకీయంగా కీలక మైలురాయి సాధించారు.

**హోలోగ్రామ్ టెక్నాలజీతో విజయ్ పార్టీ ప్రచారం**

ఇదిలా ఉండగా, తమిళనాడులో రాజకీయ ప్రచార పద్ధతుల్లో కొత్త మార్పుకు టీవీకే శ్రీకారం చుట్టింది. విజయ్ హోలోగ్రామ్‌ను ఉపయోగించి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 12న కుంభకోణం నియోజకవర్గంలో ఈ సాంకేతికతను తొలిసారిగా వినియోగించారు. హైడెఫినిషన్ 3డీ హోలోగ్రామ్ ద్వారా విజయ్ ప్రసంగం ప్రజలకు చూపించారు. ప్రచార వాహనంపై ఈ డిజిటల్ ప్రతిరూపం ప్రత్యక్షంగా మాట్లాడుతున్నట్లుగా కనిపించడంతో ప్రజల్లో ఆసక్తి పెరిగింది. టీవీకే నాయకత్వం తెలిపిన వివరాల ప్రకారం, పార్టీ 200కు పైగా నియోజకవర్గాల్లో పోటీ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి ప్రాంతానికి విజయ్ స్వయంగా వెళ్లడం సాధ్యం కాదని భావించి, హోలోగ్రామ్ టెక్నాలజీని వినియోగించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ హోలోగ్రామ్ ప్రాజెక్ట్‌ను రూపొందించిన ప్రవీణ్ అనే 20 ఏళ్ల యువకుడు, ఏఐ, డేటా సైన్స్ చదువుతున్న విద్యార్థి. అతను 50 సెకన్ల విజయ్ ప్రసంగాన్ని ఏఐ ఆధారంగా రూపొందించి, మూడు రోజుల్లో హోలోగ్రామ్‌గా మార్చినట్లు తెలిపాడు.

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్

ఎన్నికల నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దొంగ ఓట్లను అరికట్టేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్, ఐరిస్ బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థను అమలు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణను చేపట్టేందుకు సోమవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మేరకు కేంద్రం, ఎన్నిక సంఘానికి నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ అంశంపై విచారణ చేపట్టింది. అయితే ప్రస్తుత జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఈ విధానం అమలు చేయలేమని స్పష్టం చేసింది. తదుపరి పార్లమెంట్ లేదా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ విధానాన్ని అమలు చేయాలా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ విధానం అమలు చేయాలంటే నిబంధనల్లో మార్పులు అవసరమవుతాయని, అలాగే ప్రభుత్వ ఖజానాపై భారీ ఆర్థిక భారం పడుతుందని తెలిపింది. ఈ అంశంపై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, ఈసీతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేశారు. ఓటింగ్ ప్రక్రియలో అవినీతి, అనుచిత ప్రభావం, నకిలీ, డూప్లికేటు ఓట్లు వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష

-మొదటిపేజీ తరువాయి

లేదని తెలిపారు. 33 % మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండింటిని కలిపి ఇప్పుడు తీసుకువస్తున్నారన్న సీఎం 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన అమలు చేయాలని ఎన్డీఏ చూస్తోందని అన్నారు. 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను చేయాలనేది తమ డిమాండ్ అని వెల్లడించారు. ఈ రెండింటిని కలపటం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని విమర్శించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, మహిళా రిజర్వేషన్లను ఆర్నెళ్లలోనే అమలు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

### చిన్న రాష్ట్రాలు నష్టపోతాయని

డీలిమిటేషన్ అనేది చాలా ప్రమాదకర దిశలో వెళ్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం చేసే కుట్రను మోదీ చేస్తున్నారని, కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయని, ఉత్తరాదిలో కుటుంబ నియంత్రణ సరిగా జరగకపోవటంతో జనాభా విపరీతంగా పెరిగిందని ఆరోపించారు. జనాభా అంతరం వల్లనే నియోజకవర్గాల పెంపును కేంద్రం గతంలో వాయిదా వేసిందని, జనాభా ప్రాతిపదికన చేస్తే చిన్న రాష్ట్రాలు నష్టపోతాయని భావించారని పేర్కొన్నారు 2026 వరకు సీట్ల పెంపు వద్దని 2001లో వాజ్‌పేయి సర్కార్ చట్ట సవరణ చేసిందని గుర్తు చేశారు.

### ఆ రాష్ట్రాల్లో సీట్లు భారీగా పెరుగుతాయి

జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయని, దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారని, ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచుతామని మోదీ చెప్తున్నారని తెలిపారు. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో సీట్లు భారీగా పెరగనున్నాయని, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందని అంచనా వేశారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో లోక్‌సభ సీట్లు 195 అవుతాయని, సీట్ల పెంపు తర్వాత ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయని, ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కు పెరుగుతుందని వివరించారు.

ఎన్డీఏ ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని కీలకశాఖల్లో ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వటం లేదని, దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా బీజేపీ వెళ్తోందని వివర్శించారు. మహిళా బిల్లును అడ్డుపెట్టుకుని డీలిమిటేషన్ చేయొద్దని కోరారు. ప్రస్తుత సీట్ల ప్రకారమే చట్టప్రకారమే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టాలి అన్నట్లుగా ఉందని, పన్నులు కట్టాలి, సలాం కొట్టాలి అనే విధానానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. “డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని పార్టీలకు లేఖలు రాస్తాం, డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడి పెట్టొద్దు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు?. సీట్లు 50 శాతం పెంచాలని మోదికి ఏ దేవుడు చెప్పాడు?. 50 శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం పెంచుతుంది” రేవంత్ రెడ్డి, సీఎం

### 2028 వరకు గడువు ఉంది

హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది తమ డిమాండ్ సీఎం తెలిపారు. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలని కోరారు. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీ ప్రాతిపదికగా తీసుకోవాలని, కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలని, కొత్తగా పెంచే సీట్లలో మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలని డిమాడ్ చేశారు. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని, మొదట మహిళా బిల్లు ఆమోదించి తర్వాత డీలిమిటేషన్‌పై చర్చ చేయాలని అన్నారు. డీలిమిటేషన్‌పై శాసనసభల్లోనూ చర్చ జరగాలని, డీలిమిటేష న్‌పై ఒక కమిటీ వేసి ప్రజాసంఘాల అభిప్రాయాలు కూడా సేకరించాలని తెలిపారు. 2026లో జనగణన పూర్తి చేసి సమగ్ర చర్చ తర్వాత సీట్ల పెంపు చేయాలని, నియోజకవర్గాల పెంపునకు 2028 వరకు గడువు ఉందని వివరించారు.

లోక్ సభ సీట్ల పెంపులో దక్షిణాధి రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, జనాభా ప్రాతిపదికన కాకుండా దేశ వృద్ధిలో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న అంశాల ఆధారంగా సీట్ల పెంపు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ప్రస్తుతం కేంద్రం, మహిళా రిజర్వేషన్లతో పాటు సీట్ల పెంపు చేపడుతోందని, ఈ రెండు వేర్వేరు అంశాలని రేవంత్ రెడ్డి అన్నారు.

### భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తుంది

మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరూ మద్దతిస్తారని కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయని రేవంత్ అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలుపరిస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లను అడ్డుపెట్టుకొని లోక్ సభ సీట్లను పెంపును జనాభా ప్రాతిపదికన చేపట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ విధానం భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తుందని అన్నారు. జాతీయ ప్రయోజనాలే ఏ పార్టీకైనా ముఖ్యంగా ఉండాలని తెలిపారు.

### సీట్లు పెంచాలని బీజేపీ ప్రయత్నం చేస్తోంది

దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక వృద్ధి ఆధారంగా సీట్ల పెంపు ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని, దీన్ని బలవంతంగా అందరిపై రుద్దకుండా ఆర్థిక వృద్ధి ఆధారంగా అనే అంశాన్ని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిశీలించాలని కోరారు.

### డీలిమిటేషన్‌పై రేవంత్ రెడ్డికి అవగాహన లేదు


డీలిమిటేషన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్‌పై రేవంత్ రెడ్డికి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని, తాము దక్షిణాదిలోనే ఉన్నామని, అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియకు రెండు సంవత్సరాల సమయం పడుతుందని అన్నారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయొద్దని కాంగ్రెస్‌ను కోరుతున్నానని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని రేవంత్ రెడ్డికే వదిలేస్తున్నానని వెల్లడించారు.

# రేవంత్ జీడీపీ ఫార్ములా వర్కౌటవుతుందా

**హైదరాబాద్ :** నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు భారత రాజకీయాల్లో ఒక సెన్సిటివ్ వార్ జోన్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం జనగణన తర్వాత 50 శాతం సీట్ల పెంపు ఫార్ములాతో వడివడిగా అడుగులు వేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై ధ్వజమెత్తుతున్నారు. కేవలం సీట్ల పెంపు అనేది అంకెల గారడీ మాత్రమేనని, ఇది దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడమేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న అభ్యంతరాలు, ఆయన ప్రతిపాదిస్తున్న జీడీపీ ఫార్ములా ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.కేంద్రం ఆలోచిస్తున్న 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదనను రేవంత్ రెడ్డి పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. అందరికీ సమానంగా సీట్లు పెంచినప్పటికీ, అంతిమంగా ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యమే కొనసాగుతుందని ఆయన విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాదిలోని కేవలం నాలుగు రాష్ట్రాల ఎంపీ సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వస్తే, అది సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జనాభా నియంత్రణ పాటించాయి. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అద్భుత ప్రగతి సాధించాయి. ఇప్పుడు కేవలం జనాభా తక్కువగా ఉన్నారనే కారణంతో పార్లమెంట్‌లో మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అంటే.. క్రమశిక్షణతో ఉన్నందుకు మాకు ఇస్తున్న శిక్షా? అని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు.ఈ సంక్లిష్ట సమస్యకు రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన, హేతుబద్ధమైన పరిష్కారాన్ని ప్రతిపాదించారు. నియోజకవర్గాల కేటాయింపు కేవలం జనాభా మీద, లేదా నిర్దిష్టంగా 50శాతం అని కాకుండా, ఆయా రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న సహకారం ఆధారంగా ఉండాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. దేశానికి అత్యధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు నిర్ణయాధికారంలోనూ అంతే ప్రాధాన్యత ఉండాలని కోరుతున్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల రాజకీయ బలాన్ని తగ్గించడం వల్ల భవిష్యత్తులో రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. జనాభాను నియంత్రించి, ఆర్థికంగా ఎదిగిన రాష్ట్రాలను గౌరవించాలంటే జీడీపీని ఒక ప్రామాణికంగా తీసుకోవడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, మొండిగా ముందుకు వెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ అంశం మాత్రమే కాదని, కోట్ల మంది దక్షిణాది ప్రజల ఆత్మగౌరవ సమస్య అని ఆయన పేర్కొన్నారు. కేంద్రం గనుక దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, ఏకపక్షంగా పునర్విభజన చేపడితే భారీ ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. పార్లమెంట్ లోపల, బయట మా నిరసన గళం వినిపిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన రాబోయే కాలంలో దేశ సమగ్రతను ప్రభావితం చేసే అంశంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రశ్నలు కేవలం తెలంగాణ కోణంలోనే కాకుండా, మొత్తం దక్షిణాది ప్రయోజనాల దృష్ట్యా అత్యంత కీలకమైనవి. 50శాతం ప్రాతిపదికన జరిగే విభజన ఉత్తరాది–దక్షిణాది మధ్య అగాధాన్ని పెంచే ప్రమాదం ఉంది. మరి కేంద్రం రేవంత్ రెడ్డి సూచిస్తున్న జీడీపీ ఫార్ములాను పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.

# మళ్లీ టీఆర్ఎస్సే

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. గత ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ఆయన సిద్ధం చేసిన కార్యాచరణను ఈ సందర్భంగా బయటపెట్టారు.బీఆర్ఎస్ పార్టీ పేరు మార్పు గురించి కేటీఆర్ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చడం వల్ల పార్టీకి నష్టం చేకూరిందని ఆయన అంగీకరించారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన తెలంగాణ సెంటిమెంట్ పార్టీ పేరు మారడంతో కొంత పలచబడిందని భావిస్తున్న ఆయన, పార్టీని తిరిగి ‘టీఆర్ఎస్’గానే మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇది కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా భావిస్తున్నామన్నారు.పదేళ్ల పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అప్పుడు తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు.వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ తేల్చి చెప్పారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఆయన ఖచ్చితంగా కొట్టిపారేశారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఒక భ్రమ అని వ్యాఖ్యానిస్తూ, ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించారు. స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తామని, ప్రజాక్షేత్రం లోనే తమ బలాన్ని నిరూపించుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం



చేశారు.ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. కవిత కామెంట్స్ నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి..గత ప్రభుత్వ హయాంలో కొన్ని చిన్నపాటి లోపాలు జరిగాయని కేటీఆర్ ఈ సందర్భంగా అంగీకరించారు. ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరగడం వల్లనే ఆశించిన ఫలితాలు రాలేదని, ఆ పొరపాట్లపై ఇప్పటికే లోతైన అధ్యయనం చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ లోపాలను సరిదిద్దుకుని మళ్లీ ప్రజల్లోకి వెళ్తామని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఇక డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయని ఆయన తెలిపారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరగడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తెలుగు రాష్ట్రాల చరిత్రలో నలుగురు ముఖ్యమంత్రులు మాత్రమే తమ పాలనతో చెరగని ముద్ర వేశారని కేటీఆర్ అభివర్ణించారు. ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు నాయుడుతో పాటు కేసీఆర్ పేరు కూడా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన ప్రశంసించారు. చంద్రుడిపై మబ్బులు కమ్మినంత మాత్రాన వెలుగు తగ్గదని, కేసీఆర్ మళ్లీ ఉజ్వలంగా ప్రకాశిస్తారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## టీజీఎస్ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్




తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నల 13న సమ్మె నోటీసులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆర్టీసీ జేఏసీ తెలిపింది.

### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

సమ్మె నివారణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. తెలంగాణ ప్రభుత్వం, యాజమాన్యం ముందు 32 డిమాండ్లు పెట్టామని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ వైస్‌ఛైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని అన్నారు.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

-మొదటిపేజీ తరువాయి

అవసరమైతే తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొంటానని రోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకాధికారిని నియమించాలని యంత్రాంగానికి మంత్రి నిర్దేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ కమిషన్ తదితర చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించాయని మంత్రి పేర్కొన్నారు. మూడు బ్యారేజీల మరమ్మతుల ప్రక్రియలో 2027, 2028 సంవత్సరాలను అధికారులు కీలకంగా పరిగణించాలని దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయని సూచనప్రాయంగా వెల్లడించారు. అదే సమయంలో మేడిగడ్డ కొంత భాగాన్నీ పూర్తి చేస్తామన్న నమ్మకం ఉందన్నారు. బ్యారేజీల పునరావాస డిజైన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆఫ్రి ఇండియాకు బాధ్యతలు అప్పగించిందన్న ఉత్తమ్ వారంలో డిజైన్ల ప్రక్రియను పూర్తి చేయాలని అధికార్లను ఆదేశించారు.

### 45 రోజులపాటు నిరంతరం పరీక్షలు నిర్వహణ

నిర్మాణ సంస్థలు ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే నీటిపారుదలశాఖ కార్యదర్శి శ్రీధర్, కర్నల్ పరీక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. డిజైన్ల ప్రక్రియకు సంబంధించి భూభౌతిక, భూసాంకేతిక, మట్టి, హైడ్రాలిక్ మోడలింగ్ వంటి అన్ని అధ్యయనాలు సమగ్రంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. 45 రోజులపాటు నిరంతరం పరీక్షలు నిర్వహించేలా బ్యారేజీల ప్రాంతాల్లోనే ఉండాలన్న మంత్రి ఉత్తమ్ వారికి నిర్మాణ సంస్థలు పూర్తి సహకారం అందించాలని నిర్దేశించారు.

### సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆధ్వర్యంలో పనులు

ఇటీవల కాళేశ్వరం మరమ్మతుల కోసం ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి, పనుల్లో వేగం పెంచాలని రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ, సీబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కి.మీ బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఇంజినీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి త్వరలో వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం బ్యారేజ్ పనులను పూర్తి చేయాలనన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారు. అలాగే మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

ఆమె నోటీసుల్లో పేర్కొన్నారు. ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మొత్తం టెండర్ విలువ రూ.44 కోట్లు ఉంటే అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని.. తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని లీగల్ నోటీసులో సీతక్క వెల్లడించారు.

### అసలేంటీ వివాదం

చిన్నారులకు విద్యతో పాటు, పౌష్టికాహారాన్ని అందించే అంగన్?వాడీ టీచర్లకు ప్రభుత్వం రూ.44 కోట్లు వెచ్చించి సెల్‌ఫోన్లను అందించింది. గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటంలో అంగన్‌వాడీ కేంద్రాలు ముఖ్యపాత్ర పాత్ర పోషిస్తున్నాయి. పిల్లల హాజరు, పౌష్టికాహారం అందించే వివరాలను సెల్‌ఫోన్లలో టీచర్లు ఎంటర్ చేస్తున్నారు. పోషణ్, ఎన్ఎస్‌టీఎస్ అనే యాప్‌ల ద్వారా గర్భిణుల, బాలింతల ఫేస్ రికగ్నిషన్ కోసం ఫొటో తీయాల్సి ఉంటుంది. అదేవిధంగా యుక్త వయసు పిల్లలకు పోషకాలను అందించాలనే ఉద్దేశంతో పల్లీ పట్టి అందిస్తున్నారు. ఈ వివరాలను కూడా అంగన్?వాడీ టీచర్లు యాప్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ టీచర్లకు గతంలో సెల్‌ఫోన్లు అందించగా వాటికి 5జీ స్థాయి నెట్‌వర్క్ సామర్థ్యం లేదు. దీంతో సిగ్నల్ సరిగా ఉండని ప్రాంతాల్లో టీచర్లు వాటిని ఉపయోగించటంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. పోషణ్ యాప్?ను వినియోగించటం సెల్‌ఫోన్లతో సాధ్యపడేది కాదు. భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్ సరిగా ఉండదు. ఆ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పనిచేయక పోవటంతో టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో అందించిన స్మార్ట్?ఫోన్లకు అనేక సమస్యలు ఉత్పన్నం అవటంతో వినియోగించలేదు. ఈ సమస్య కారణంగా ప్రభుత్వం అధునాతన ఫీచర్లు ఉన్న నూతన సెల్‌ఫోన్లను అందించింది. అంగన్‌వాడీ టీచర్లకు నూతన సెల్‌ఫోన్లు అందించే ప్రక్రియ మొదలైంది. సెల్‌ఫోన్ల ద్వారానే అంగన్?వాడీ టీచర్లు విధులు నిర్వహించాల్సి ఉండటంతో వాటి అవసరం ఎంతో ఉంది. అయితే సెల్?ఫోన్ల కొనుగోలు విషయంలో 30 కోట్ల అవినీతి జరిగిందని బీఆర్ఎస్? పార్టీ ఆరోపిస్తూ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని వాటిని తొలగింటి, క్షమాపణలు చెప్పాల్సిందేనని బీఆర్ఎస్ అధినేతకు సీతక్క నోటీసులు పంపించారు.

### ఎందుకు లీగల్ నోటీసులు పంపించారు

కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు పంపడంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందించారు. అంగన్వాడీ టీచర్ల స్మార్ట్‌ఫోన్లలో అవినీతి జరిగిందని ఆరోపించారు. 35,310 స్మార్ట్‌ఫోన్ల కోసం రూ.54 కోట్లకు టెండర్ ఇచ్చారని, స్మార్ట్‌ఫోన్లపై రూ.24 కోట్లే ఖర్చు చేశారని, మిగిలిన రూ.30 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. 4జీ ఫోన్లు ఇస్తూ 5జీ ఫోన్లు ఇస్తున్నామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. సమాధానం చెప్పమంటే సీతక్క చెప్పుతో కొడతామంటున్నారని, తాము అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని సీతక్క అంటున్నారని పేర్కొన్నారు. సీతక్క కేసీఆర్‌కు ఎందుకు లీగల్ నోటీసులు పంపించారని ప్రశ్నించారు.

# క్షేమంగా ఇంటికి రండి..
# మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తుంది




**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్,**

**వరంగల్ :** వాహనాలపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబందనలు పాటిస్తూ క్షేమంగా ఇంటి రావాలని..మీ రాక కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో రోడ్డు భద్రతతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకుగా నేటి నుండి ఈ నెల 18 తేది వరకు చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమములో భాగంగా ఎల్కతుర్తి మండలం చింతల్ పల్లి గ్రామంలో ఎల్కతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధి పాల్గొన్నారు. ఈ సందర్బంగా చింతల్ పల్లి గ్రామంలో ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించే విధంగా వాహన దారులకు అవగాహన కల్పించి రీతిలో ఎర్పాటు చేసిన బైక్ ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనర్, సెంటర్ జోన్ డిసిపి ధార కవిత, స్థానిక పోలీస్ అధికారులు గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారులతో బైక్ ర్యాలీలో పాల్గొని గ్రామస్తులను ఉత్తేజపరిచారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాల యము ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు పోలీస్ కమిషనర్ పాల్గొని గ్రామస్తులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా నడపాల్సి వుంటుందని ముందుగా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపటంతో పాటు, సెల్ఫోన్లో మాట్లాడుతూ ప్రయాణించడం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, హెల్మెట్ ధరించి వాహనం నడపటం ద్వారా ప్రమాదాలకు గురైనప్పుడు ప్రమాద భారిన పడకుండా హెల్మెట్తో రక్షించబడుతారని, అలాగే యువత అతివేగంగా వాహనాలను నడిపి మృత్యువాత పడవద్దని రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఈ రోడ్డు ప్రమాదాలు ఎంతో మంది తల్లిదండ్రులకు కన్నీళ్ళకు కారణమవుతున్నాయని ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా వాహనంగా నడపటంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగివుండటంతో పాటు వాటిని అచరించాలని సిపి తెలియజేసారు. అనంతరం చింతల్ పల్లి గ్రామంలోని వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి రావాలని లేదంటే గ్రామంలో ప్రవేశం లేదని గ్రామ సభలో తీర్మానం చేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీలు చేసారు. ఈ కార్యక్రమములో కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, కాజీపేట్, హసన్పర్తి ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, చేరాలు, ఎల్కతుర్తి, ముల్కనూర్ ఎస్.ఐలు ప్రవీణ్ కుమార్, రాజు, గ్రామ సర్పంచ్ రజితా రవీందర్, మార్కెట్ చైర్మన్ సంతాజీతో ఇతర పోలీస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగన్నాథపురం రహదారి వెడల్పు చేయడంలో జాప్యమేలా

**50 అడుగుల రోడ్డు 40 అడుగులకు ఎలా మారుతుంది ?**

**డిజైన్ మార్పు ఎమ్మెల్యేకు తెలుసా ?**

**అధికారుల సూచనలను వ్యాపారులు బేకాతరు చేస్తున్నారా!**

**అధికారులకు ముడుపులు అందడంతోనే రహదారి డిజైన్ మారిందా ?**



**భద్రాద్రి :** భద్రాద్రి జిల్లా పరిధిలోని ములకలపల్లి మండల పరిధిలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న జగన్నాధపురంలో జాతీయ రహదారి వెడల్పు తగ్గించాలన్న ఆలోచన వెనుక రహస్యమేమిటో అర్థం కాక జగన్నాధపురం ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఆర్ అండ్ బి, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారుల సూచనలను రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార వర్గాలు బేకాతరు చేస్తున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల 5వ తేదీన ఆర్ అండ్ బి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, పోలీస్ శాఖల అధికారులు వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం గ్రామం వద్ద 50 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే నెల 15 రోజులు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో పట్ల పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కిరువైపుల బడా వ్యాపారుల సముదాయాలు ఉండటం వల్లనే అధికారులు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆనాడు 50 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాల్సిందేనని ప్రజల సమక్షంలోనే ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఇచ్చిన గడువు దాటిపోయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు తమ భవన సముదాయాలను నేటికి తగ్గించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగూడెం నుంచి భద్రాచలం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న దమ్మపేట క్రాస్ రోడ్డు నుండి అశ్వరావుపేట వద్ద గల మందలపల్లి జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. అయినా నెల 15 రోజులు అవుతున్నప్పటికీ వ్యాపారులకిచ్చిన గడువుదాటి పైన అధికారం నోరు మెదపకపోవడం ఏమిటని సర్వత్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పనులు నేటికీ ప్రారంభం కాకపోగా వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం లొ ఆనాడు 50 అడుగులు ఉండాల్సిందే అని స్పష్టం చేసిన అధికారులు, నేడు 40 అడుగులు వెడల్పు ఉంటే సరిపోతుందని అంటున్నట్లు తెలుస్తోంది. వ్యాపారు కూడలిగా ఉన్న ఆ గ్రామంలో ప్రధాన రహదారిని 10 అడుగులు తగ్గించినందుకు అధికారులకు పెద్ద ఎత్తున ముడుపు అందాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఎంతవరకు సమంజసమో అధికారులు ఎవ్వరికి వారు ప్రశ్నించుకోవాల్సి ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రోడ్డు వెడల్పు తగ్గించాలనే ప్రతిపాదన అశ్వరావుపేట ఎమ్మెల్యే దృష్టిలో ఉందా ? లేక సంబంధిత అధికారులకు ముడుపులు ఏమైనా అందాయ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు వెడల్పు 50 అడుగులా! 40 అడుగుల అన్న సమస్యను పక్కనపెట్టి పన్నులు ప్రారంభించాల్సిందేనంటున్న ఆ గ్రామ ప్రజలు. ఇప్పటికైనా పనులు ప్రారంభిస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్'
# ప్రాణాలను నిర్లక్ష్యం చేయకండి

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ చిత్రా మిశ్రా,సిపి గౌస్ ఆలం**

**కరీంనగర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ మరియు రవాణా శాఖల సమన్వయంతో తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.చట్టాలను కఠినంగా అమలు చేయాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లిముఖ్య అతిథి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాలు పేద, ధనిక అనే తేడా లేకుండా అందరినీ దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నా యని పేర్కొన్నారు.డ్రంకన్ డ్రైవ్లో ఎవరైనా పట్టుబడితే రికమండేషన్ కోసం నాకు ఫోన్ చేయవద్దు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం క్షేమంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.




గ్రామసభల్లో భద్రతపై చర్చించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రాజిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల వల్ల ఛిన్నాభిన్నమైన కుటుంబాల గాథలు వింటే మనసు కలచివే స్తోందని అన్నారు. సర్పంచులు తమ గ్రామసభల్లో రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా చర్చించాలని, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ వంటి ఏర్పాట్లపై శ్రద్ధ వహించాలని సూచించారు.హెల్మెట్ ధరించడం తప్పనిసరి: సిపి గౌస్ ఆలంసిపి గౌష్ ఆలం మాట్లాడుతూ. జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం మరణాలకు ప్రధాన కారణాలన్నారు. పోలీసుల చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గిందని, ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి ఇస్తుందని తెలిపారు. 'రహ వీర్' పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందు బాటులో ఉందని వివరించారు.కన్నీళ్లు పెట్టించిన బాధితుల గాథలు:ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధితులు స్టేజీపై తమ ఆవేదనను పంచుకున్నారు. వారి మాటలు సభికులను కంటతడి పెట్టించాయి. గ్రామ సర్పంచ్ శ్వేత మాట్లాడుతూ, తమ గ్రామాన్ని ఈ కార్యక్రమానికి ఎంచుకున్నందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసుశాఖ తరుపున, ఎమ్మెల్యే గారి చేతులమీదుగా పలువురికి హెల్మెట్లను అందజేశారు. అంతేకాకుండా స్థానికులకు, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు, సర్పంచులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోతంగల్లో చలివేంద్రం ప్రారంభం



**వాస్తవ నేస్తం కోటగిరి:** వేసవి కాలం దృష్ట్యా పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, బాటసారుల సౌకర్యార్థం లిపోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ సంధ్య హనుమాన్లులి సోమవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎండలు రోజురోజుకూ ముదురుతున్న నేపథ్యంలో బస్టాండ్కు వచ్చే ప్రయాణికులు, కూలీలు మరియు సామాన్య ప్రజలు దాహంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక యువత పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం



**వాస్తవ నేస్తం,కోటగిరి :** కోటగిరి గ్రామానికి చెందిన గోపి సాయిలు (30), తండ్రి శంకర్, ప్రస్తుతం తన భార్యతో కలిసి ఆర్మూర్లో నివసిస్తున్నాడు. ఏప్రిల్ 12,ఆదివారం రోజున సొంత గ్రామం కోటగిరికి వచ్చిన సాయిలు, తిరిగి రాత్రి 8 గంటల సమయంలో ఆర్మూర్కు వెళు న్నానని చెప్పి బయలుదేరాడు.అయితే, సాయిలు ఆర్మూర్లోని తన నివాసానికి చేరుకోకపోవడంతో పాటు ఆచూకీ తెలియకుండా పోయాడు. బంధువులు మరియు తెలిసిన వారందరినీ విచారించినా ఫలితం లేకపోవడంతో, అతని తల్లి గోపి అనూష స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై సునీల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, సమాచారం తెలిసిన వారు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



**వాస్తవ నేస్తం కోటగిరి:** పొతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో భాగంగాలి రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మరియు పోలీసులు గ్రామస్థులకు రోడ్డు నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని సూచించారు. గ్రామ సభకు హాజరైన యువతకు మరియు ప్రజలకు ట్రాఫిక్ నియమాలను వివరించడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాంరెడ్డి, ఉప్ప సర్పంచ్ దశరథ్, పంచాయతీ సెక్రటరీ ప్రతాప్,గ్రామ పెద్దలు శంకర్ పటేల్, పెండ్లా గంగారాం, శ్రవణ్,యాదగౌడ్,కంధర్ సాయిలు, బాలకృష్ణ, బాజీరెడ్డి ,పోలీసులు మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై గ్రామస్తుల ప్రతిజ్ఞ..




**వాస్తవ నేస్తం,కోటగిరి :** 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కొటగిరి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో సి.ఐ రుద్రూర్ గారితో కలిసి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రహదారి భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనల అమలుపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతా చర్యలపై గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రహదారి ప్రమాదాల నివారణకు మరియు ప్రజల్లో నిరంతరం అవగాహన పెంపొందించడానికి ప్రత్యేకంగా 'రహదారి భద్రతా కమిటీ'ని ఏర్పాటు చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ట్రాఫిక్ నియమాలను తూచా తప్పకుండా పాటిస్తామని, ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎస్.ఐ సునీల్ , ఇతర పోలీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com